క్లుప్తంగా

నేడు చీఫ్‌విప్ ముదునూరి పర్యటన ఇలా

నరసాపురం: ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గురువారం నియోజకవర్గంలో అందుబాటులో ఉంటారు. ఉదయం 9.30 గంటలకు నరసాపురంమండలం చామకూరిపాలెంలో రూ.8 లక్షలతో నిర్మించిన స్కూల్ భవనాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటలకు అదే గ్రామంలో సచివాలయం వద్ద జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 11 గంటలకు మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో రూ 40 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభిస్తారు. ఉదయం 11.30 గంటలకు పేరుపాలెంలో జరిగే జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారు.

విప్ గ్రంధికి అభినందనలు


భీమవరంలో ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్‌ను అభినందిస్తున్న దృశ్యం

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితులైన భీమవరంశాసన సభ్యుడు గ్రంధి శ్రీనివాస్‌ను ఆచంట నియోజకవర్గ నాయకులు అభినందనలు తెలిపారు. బుధవారం భీమవరంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి మేడపాటి సాయి చంద్రమౌళీశ్వర రెడ్డి, రాష్ట్ర విద్యా మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవ రెడ్డిలు కలిసి అభినందనలు తెలిపారు.

పైపులైన్ పనులకు శంకుస్థాపన

ఉండి: మండలంలోని కోలమూరులో పైపులైన్ విస్తరణ, నూతన ఫిల్టర్ బెడ్ నిర్మాణ పనులకు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటూ జల్ జీవన్ మిషన్ నిధులు రూ.47 లక్షలతో పైపులైన్ విస్తరణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అలాగే మరింత సురక్షితమైన తాగునీటిని అందించాలనే ఉద్దేశ్యంతో కొత్త ఫిల్టర్ బెడ్ నిర్మాణాన్ని కూడా చేపట్టనున్నట్లు పీవీఎల్ తెలిపారు. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ నడింపల్లి సత్యవతి, ఉప సర్పంచ్ నడింపల్లి రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు గంద్రాజు రాజేష్, ఎంపీటీసీ పేరిచర్ల అరుణ భార్గవి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఆకివీడు: గ్రామ వలంటీర్ పోస్టులకు ఈనెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కె.వాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. మందపాడు గ్రామంలో బీసీ-డి మహిళ, ఆకివీడు-2, 3లో మహిళ, ఓసీ జనరల్ వ్యక్తులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తుదారులు 10వ తరగతి ఉత్తీర్ణులై, సంబంధిత గ్రామ సచివాలయ పరిధిలో నివసిస్తూ ఉండాలని పేర్కొన్నారు.

ఎరువుల వాడకాన్ని నియంత్రించాలి

పాలకోడేరు: రసాయనిక ఎరువులు వాడకాన్ని నియంత్రించేందుకు సేంద్రియ వ్యవసాయమే శరణ్యమని జిల్లా పంచాయతీ అధికారి జీకేవీ మల్లికార్జునరావు అన్నారు. జిల్లాలోనే మొట్టమొదటి సారిగా పాలకోడేరు మండలంలోని గొరగనమూడి రైతు భరోసా కేంద్రంలో ఆర్గానిక్ వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీ, విక్రయ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ 1960లో ఆహార కొరతను అధిగమించేందుకు ఆధునిక వ్యవసాయ విప్లవాన్ని అభివృద్ధి చేసేందుకు శాస్త్రవేత్తలు ఎంతగానో కృషి చేశారని అన్నారు. అయితే రైతులు రసాయనిక ఎరువులను విచ్చలవిడిగా వాడటం వల్ల భూములు సారవంతాన్ని కోల్పోయాయని తెలిపారు. దీనికి విరుగుడు సేంద్రియ వ్యవసాయం చేపట్టడమేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో మురళీ గంగాధర రావు, సర్పంచ్ గొట్టుముక్కల వెంకట శివరామ రాజు, ఉప సర్పంచ్ గూడూరు ఆంజనేయులు, డీపీఆర్సీ కో ఆర్డినేటర్ ఎడ్వర్డ్, పంచాయతీ కార్యదర్శి పోలయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ కొనుగోలుకు సాయం

పాలకోడేరు: శృంగవృక్షం హైస్కూల్‌లో చదివిన 1984-85 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల క్రీడాకారులకు స్పోర్ట్స్ డ్రెస్ నిమిత్తం బుధవారం రూ.20 వేల నగదును హెడ్ మాస్టర్ తోట కాశీజగన్నాథంకు అందజేశారు. కార్యక్రమంలో పీఈటీలు మహ్మద్ ఖుద్దూస్, కె.చిట్టిబాబు, పూర్వ విద్యార్థులు గులిపల్లి సత్యనారాయణ, బురాబత్తుల దుర్గారావు, పాలా దుర్గారావు, గుమ్మాపు ఆశీర్వాదం, మేడిది జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఉండి: మండలంలోని యండగండి ఖండ్రిక వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.6,20,660 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై ఆకురాతి సూర్యనారాయణ తెలిపారు.

గ్రామాల్లో సదుపాయాల కల్పనే ధ్యేయం

చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు


నరసాపురం రూరల్: పెదమైనవానిలంక సచివాలయంవద్ద ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు


మొగల్తూరు: శేరేపాలెంలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ప్రసాదరాజు

నరసాపురం రూరల్: పల్లెల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు ప్రభుత్వం ఎక్కువ నిధులు ఖర్చు చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని పెదమైనవానిలంక గ్రామ సచివాలయం వద్ద బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జరిగన సభలో ఆయన మాట్లాడుతూ మనం, మన కుటుంబం అంతా ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారపు అలవాట్లను కూడా పాటించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపుల వద్ద స్త్రీ, శిశు సంక్షమశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పౌష్టికాహార స్టాల్స్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నార న్నారు. ముఖ్యంగా శిబిరానికి వచ్చిన ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమన్నారు. శిబిరానికి వచ్చిన వారందరికీ వైద్య పరీక్షలు చేసి వారి ఆరోగ్య సమస్యలను నివృత్తి చేయాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో రూ.27లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభించి, రూ.30 లక్షలతో నిర్మించనున్న పలు రహదారులకు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమాల్లో మార్కెట్‌యార్డు చైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్పీటీసీ సభ్యుడు బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్‌నాయుడు, తిరుమాని దుర్గ, జిల్లా మత్స్యకార సంఘం అధ్యక్షుడు అంద్రాజు చల్లారావు, సర్పంచ్ కొల్లాటి కనకదుర్గ, చినమిల్లి చందు, మైలాబత్తుల శ్రీను, వడుగు జనార్ధనరావు, తిరుమాని కృష్ణంరాజు, మైల తిరుపతిరావు, కొల్లాటి ఏసు తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరులో...

పల్లెపల్లెకు ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సేవలను అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును ఏర్పాటు చేశామని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మొగల్తూరు మండలంలోని శేరేపాలెం హైస్కూల్ వద్ద జరిగిన జగనన్న ఆరోగ్య మెడికల్ క్యాంపును బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని సర్కారు గ్రామాల్లో హెల్త్‌క్లినిక్ భవనాలను నిర్మించుకుని సింగిల్‌బెడ్ ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా గ్రామస్థాయిలోనే అనారోగ్య సమస్యల పరిష్కారానికి శ్రీకారం జరుగుతుందన్నారు. అనంతరం ఆయన శేరేపాలెం, నౌడూరు వారి గర్వు ప్రాంతాల్లో రూ.20 లక్షలతో నిర్మించిన సీసీ రహదారిని ప్రారంభించారు. రూ.21.80 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభించి, అనంతరం ఎస్సీ కాలనీలో రూ.60 లక్షల జల జీవన్ మిషన్ ఫేజ్2 నిధులతో ఓవర్‌హెడ్ ట్యాంకు, పైపులైను నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామని ప్రసాదరాజు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాబ్జి, వైస్ ఎంపీపీ కైల సుబ్బారావు, సర్పంచ్ తణుకుల మునీశ్వరరావు, కర్రి ఏసుబాబు, గూడూరి మావుళ్లు, తన్నీడి గిరి, రేవు నారాయణ మూర్తి, కొత్తపల్లి బాబి, పాలా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో పేదల ఆరోగ్యానికి భరోసా


పాలకొల్లు అర్బన్: కాపవరంలో ఆరోగ్యశ్రీ కార్డులు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)


పెనుగొండ: ఆచంట వేమవరంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న రుడా చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి


పోడూరు: గుమ్మలూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో నాయకులు, డాక్టర్లు, వైద్య సిబ్బందితో రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి


యలమంచిలి: బూరుగుపల్లిలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో పాల్గొన్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

పాలకొల్లు అర్బన్: ప్రతి కుటుంబం ఆరోగ్యంతో జీవిస్తే సమాజం అభివృద్ధి చెందుతుందనే ఆలోచనతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. మండలంలోని కాపవరంలో బుధవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని గుడాల గోపి ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్లు అడ్డాల ప్రతాప్‌కుమార్, సత్య సౌజన్య, గంగాభవాని, సుధీర్‌లు 402 మంది రోగులను పరీక్షించి మందులు ఉచితంగా అందజేశారు. వీరిలో 8 మందిని ఆరోగ్యశ్రీకి శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేశారు. 156 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 124 మందికి కళ్లజోళ్లు అందించడానికి చర్యలు తీసుకున్నారు. 16 మంది కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ఎంపిక చేశారు. సర్పంచ్ కోలాటి రాధ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాష్, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకమండలి సభ్యులు మేకా శేషుబాబు, ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవింద రాజుల నాయుడు, చింతలపూడి, దెందులూరు నియోజకవర్గాల వైఎస్సార్‌సీపీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, ఎంపీటీసీ సభ్యురాలు యాండ్ర శైలజాకుమారి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ యన్నాబత్తుల నాగేశ్వర రావు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, వాలమర్రు సర్పంచ్ గంటా సత్యనారాయణ, సొసైటీ అధ్యక్షుడు వేండ్ర సింహాచలం, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే జగనన్న లక్ష్యం

యలమంచిలి: ఆరోగ్యాంధ్రప్రదేశ్ నిర్మాణమే జగనన్న లక్ష్యమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అన్నారు. బూరుగుపల్లి గ్రామంలో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో గోపి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమన్నారు కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు, ఎంపీడీఓ చివటం త్రిశూల పాణి ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లెం ఆనందప్రకాష్, దెందులూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, పార్టీ మండల కన్వీనర్ పాత్తూరి బుచ్చిరాజు, సచివాలయ మండల కన్వీనర్ ఓదూరి భాస్కరరావు సర్పంచ్ చెల్లింకుల లక్ష్మి, ఎంపీటీసీ కడలి వెంకట సుబ్బలక్ష్మి పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పెంటపాటి నూకరాజు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇకపై నిరంతరం జగనన్న ఆరోగ్య సురక్ష

పెనుగొండ: ప్రతి పేదవాడికి వైద్యం అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్షను నిరంతర ప్రక్రియగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారని రుడా చైర్‌పర్సన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలా రెడ్డి అన్నారు. బుధవారం ఆచంట మండలం ఆచంట వేమవరంలో జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా విద్య వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. పేదలు రోగాల భారిన పడకుండా క్షేత్రస్థాయిలోనే ముందుగానే రక్షించడానికి జగనన్న ఆరోగ్య సురక్షను ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావ్య, ఆచంట వేమవరం సర్పంచ్ జక్కం శెట్టి చంటి, ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్, వీవర్స్ కార్పొరేషన్ డైరక్టరు అందే నాగ బసవన్న, ఉప సర్పంచ్ కొండేటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: ఊరంతా ఆరోగ్యం అదే జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందించే మహాభాగ్యమని వైఎస్సా ర్‌సీపీ ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు రాజమండ్రి రుడా చైర్‌పర్సన్ మేడపాటి షరిమ్లా రెడ్డి అన్నారు. మల్లిపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న వైద్య ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దొంగ మహాలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో షర్మిలా రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలోనే ఆధునిక వైద్యాన్ని పేదలకు జగనన్న అందుబాటులోకి తీసుకువస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ వి.వెంకటరమణ, ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, కర్రి గౌరి సుభాషిణి, గుడిమట్ల బాల గంగాధర్‌రెడ్డి, దండు రామరాజు, నల్లి మిల్లి గోపి, గుడిమెట్ల గోపాలకృష్ణరెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా

పోడూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం పేదల ఆరోగ్యానికి భరోసా అని ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డి అన్నారు. గుమ్మలూరులో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని షర్మిలారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న చిన్న ఆరోగ్య సమస్యలతో పాటు దీర్ఘకాలిక వ్యాధులు, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న పేద రోగులకు ప్రభుత్వం ద్వారా నాణ్యమైన వైద్య సేవలను అందించే లక్ష్యంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి 'ఆరోగ్య సురక్ష' పథకానికి శ్రీకారం చుట్టారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెద్దిరాజు, ఎంపీపీ సుమంగళి సాగర్, సర్పంచ్ సోనియా రమేష్, ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లా లావణ్య, మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు, మినిమించిలిపాడు సర్పంచ్ రామన వీర్రాజు, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, ఎంపీటీసీ సభ్యులు పోతాబత్తుల శ్రీలక్ష్మిదుర్గ, అంబటి సుధాకర్, ఎంపీడీఓ డి.సుహాసిని, తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు, ఉపసర్పంచ్ అల్లూరి గీతావాణి తదితరులు పాల్గొన్నారు.

బాలికల ఆరోగ్యమే దేశ సౌభాగ్యం


యలమంచిలి: బూరుగుపల్లిలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా


పాలకొల్లు అర్బన్: కాపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న బాలికలు, అధికారులు


పాలకొల్లు సెంట్రల్: జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో బాలిక దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

యలమంచిలి: బాలికల ఆరోగ్యమే దేశ సౌభాగ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా అన్నారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం బూరుగుపల్లి పంచాయతీ మట్టవానిచెరువు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులతో ఆమె సమావేశం నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో హెచ్‌ఎం ఎం కరుణకుమార్ ఉపాధ్యాయులు ఎం శ్రీనివాస్, బి శైలజ, జి రాంబాబు, కె సత్యనారాయణ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంధం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ధృడమైన శక్తిగా ఎదగాలి

పాలకొల్లు అర్బన్: బాలికలు ధృఢమెన శక్తిగా ఎదగాలని ఎంపీడీవో సంగాని వెంకటేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం కాపవరంలో కిషోర బాలికలతో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుని రక్తహీనత సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఐసీడీఎస్ పాలకొల్లు ప్రాజెక్టు సూపర్‌వైజర్ పులఖండం సత్యవేణి, పాల్గొన్నారు.

జీవీఎస్‌వీఆర్‌ఎం పాఠశాలలో

పాలకొల్లు సెంట్రల్: బాలికలపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను నివారించి వారి హక్కులను తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి బాలికల దినోత్సవాన్ని ప్రకటించిందని ప్రముఖ న్యాయవాది కర్ర జయసరిత అన్నారు. బుధవారం స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో అంతర్జాతీయ బాలిక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జయసరిత మాట్లాడుతూ అమెరికన్ పౌరహక్కుల కార్యకర్త ఎలానార్ రూజ్‌వెల్ట్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బాలిక దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాయపూడి భవానీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో సీఎం జగన్ ముందంజ

కాళ్ల: సంక్షేమ పథకాల అమలులో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే ముందుంటున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. మండలంలోని బొండాడ గ్రామంలో బుధవారం ప్రజా సంకల్ప పాదయాత్ర పురస్కరించుకుని ఉండి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నే నాగరాజు ఇంటి వద్ద గ్రామ పెద్దలు, వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. పీవీఎల్ మాట్లాడుతూ గడిచిన నాలుగున్నర ఏళ్లలో బొండాడ గ్రామాభివృద్ధికి సుమారు రూ.15.50 కోట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చినట్లు చెప్పారు. నిత్యం ప్రజల కోసం ఆలోచించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నర ఏళ్లలో 95 శాతం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. మిగిలిన ఐదు శాతం కూడా ప్రజలకు అందించాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందిస్తున్నారని అన్నారు. అనంతరం పార్టీ నాయకులు గ్రామ పెద్దలతో కలిసి గ్రామంలో ప్రజా సంకల్ప పాదయాత్ర నిర్వహించారు.

లెర్నింగ్ ప్రాజెక్ట్‌పై దృష్టి సారించాలి

సాక్షి, భీమవరం: స్థానిక విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నందు స్పార్క్ ట్యాంక్ -2023 ఫైనల్స్ కార్యక్రమం జరిగినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ దశిక సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులు లోతైన కంటెంట్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయన్నారు. టెక్నాలజీ, కమ్యూనికేషన్ స్కిల్స్‌ను విద్యార్థులు అభివృద్ధి చేసుకోవాలన్నారు. అన్ని శాఖల సహాయంతో లెర్నింగ్ ప్రాజెక్ట్‌లను చేయాలని సూచించారు. స్పార్క్ ట్యాంక్ -2023 ద్వారా ప్రాజెక్ట్‌లు చేసిన బృందాల్లో విజేతలను ప్రకటించి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ పోటీల్లో మొత్తం 120 జట్లు పాల్గొన్నాయని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డాక్టర్ ఎంకే కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గవరపేటలో జగనన్న ఆరోగ్య సురక్ష

పాలకొల్లు అర్బన్: మండలంలోని గవరపేట పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం ఉదయం 11గంటలకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సంగాని వెంకటేశ్వరరావు, తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12గంటలకు పట్టణంలోని బీఆర్ఎంవీ మునిసిపల్ హైస్కూల్ ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) పాల్గొంటారని పేర్కొన్నారు.

విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై కేసు

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు గ్రామానికి చెందిన ఆరో తరగతి చదువుతున్న స్కూల్ విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్ నేతల నరేంద్రపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై ఎస్.శ్రీనివాసు బుధవారం విలేకరులకు తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో 6వ తరగతి చదువుతున్న ఆ విద్యార్థిని తన సోదరుడితో కలిసి రోజూ ఆటోలో స్కూల్‌కు వస్తుంది. అయితే ఆ విద్యార్థినిని నరేంద్ర ప్రతీ రోజు మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఈ విషయాన్ని విద్యార్థిని తల్లికి చెప్పడంలో ఆమె పోలీసులను ఆశ్రయించింది.

లక్కువారితోటలో అగ్ని ప్రమాదం

నరసాపురం రూరల్: మొగల్తూరు మండలం రామన్నపాలెం పంచాయతీ పరిధిలోని లక్కువారితోట గ్రామంలో బుధవారం లక్కు వీరబాబుకు చెందిన తాటి ఆకుల ఇల్లు అగ్నికి ఆహుతైంది. విద్యుత్ సార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన ఈ అగ్ని ప్రమాదంలో వీరబాబు కుటుంబం నిరాశ్రయులయ్యారు. ఈ ప్రమాదంలో వీరబాబు కుమార్తెలకు చెందిన విద్య తదితర ధ్రువీకరణ పత్రాలు, రూ.42 వేల నగదు, వెండి, బంగారు ఆభరణాలు తదితర రూ.4 లక్షల విలువైన సంపద ఈ ప్రమాదంలో అగ్నికి ఆహుతైనట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

అలరించిన సంగీత, సాంస్కృతిక సమాహారం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని బీవీఆర్ కళాకేంద్రంలో నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ యోగా కోచ్ కరిబండి రామకృష్ణకు గౌరవ పురస్కారం, నాట్యాచారిణి నండూరి రాధికకు కళారత్న పురస్కారం, మంచానపడి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఓ కళాకారుడుకు రూ 56 వేలు ఆర్థిక సత్కారం చేశారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సభను బీవీఆర్ వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు నిర్వహించారు. వ్యాఖ్యాతగా సరస్వతుల హనుమంత రావు, అతిథులుగా బీజేపీ నాయకులు ఈతకోట తాతాజీ, ప్రముఖులు యెగ్గిన నాగబాబు, మాకా శ్రీనివాసరావు, ఎన్వీ రమణారావు, కళాకారులు పీటీ వెంకన్న, కోపల్లె శ్రీనివాస్, పుల్లాభొట్ల సూర్య నారాయణమూర్తి, బడుగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.